సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 2 । అక్టోబర్ । 2024



ఇసుకను దోచుకెళ్లిన టీడీపీ వర్గీయులు

అధికారులు సీజ్ చేసిన ఇసుకను టీడీపీ వర్గీయులు దోచెకెళ్లారు. అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి యత్నించారు. - 10లో



ఓటర్ల సవరణను త్వరితగతిన పూర్తి చేయాలి

ఓటర్ల సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.540	రూ.640
రెండోరకం	రూ.400	రూ.520

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 133 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఈ నెల 3 నుంచి దసరా సెలవులు

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు ఈ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రభుత్వం ప్రకటించినట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి యు.శివప్రకాష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలవులలో పాఠశాలలు పిల్లలకు ప్రైవేట్ క్లాసులు కానీ, ఎలాంటి తరగతులు నిర్వహించకూడదన్నారు. ఉత్తర్వులు ఉల్లంఘించిన యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీఆర్‌ఓల బదిలీలు

రాయచోటి: అన్నమయ్య జిల్లా జిల్లా పరిధిలోని 354 మంది విలేజ్ రెవెన్యూ అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి రెవెన్యూ డివిజన్ల పరిధిలోని గ్రేడ్-1 వీఆర్‌ఓలు 176 మంది, గ్రేడ్-2 వీఆర్‌ఓలు 178 మందికి స్థానచలం కల్పించారు. ఉత్తర్వుల మేరకు రెండు రోజుల్లో కేటాయించిన ప్రాంతాలలో బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు.

వెయ్యి అడుగుల గాంధీ చిత్రపటం



వెయ్యి అడుగుల మహాత్మా గాంధీ చిత్రపటాన్ని చూపిస్తున్న ఆనంద్‌రాజు

రామాపురం: అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఓ ఆర్ట్స్ టీచర్ వినూత్నంగా నివాళులర్పించారు. రామాపురం మండలంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని ఆర్ట్స్ టీచర్ ఆనంద్‌రాజు వెయ్యి అడుగుల మహాత్మాగాంధీ చిత్రపటాన్ని రూపొందించారు. ఇంత పెద్ద చిత్రపటాన్ని రూపొందించడం ప్రపంచ రికార్డు సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పంట కోత ప్రయోగాల పరిశీలన



పంట కోత ప్రయోగాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గాలివీడు: మండలంలోని గోపనపల్లె గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ వేరుశనగ పంటకోత ప్రయోగాలను పరిశీలించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన పంటకోత ప్రయోగాలను తనిఖీ చేసి దిగుబడి లెక్కింపు ప్రక్రియ జరిపారు. పందికుంట గ్రామంలోని రైతు సేవాకేంద్రం పరిధిలో ఈ పంట నమోదు జాబితాలో కొన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీధర్, జేడీఎస్ కార్యాలయ టెక్నికల్ ఏఓలు వెంకటమోహన్, రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్ రూమ్‌లో వసతులు మెరుగుపరచాలి



రన్నింగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఏడీఆర్‌ఎం సుధాకర్

నందలూరు: నందలూరు రైల్వే కేంద్రంలోని రన్నింగ్ రూమ్‌లో వసతులు మెరుగుపరచాలని సిబ్బందికి రైల్వే గుంతకల్ డివిజన్ ఏడీఆర్‌ఎం సుధాకర్ కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన నందలూరు రైల్వే కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు రన్నింగ్ రూమ్‌లోని సమస్యలను ఏడీఆర్‌ఎం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రైల్వే గ్రంథాలయంలో లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కమలాకర్, అధికారులు పాల్గొన్నారు.

వాసవీ.. వైభవం

- వరాల తల్లి.. కన్యాకా పరమేశ్వరి
- రేపటి నుంచి వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం
- పసిడిపురిలో అట్టహాసంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు
- ఉత్సవాల నిర్వహణలో ప్రొద్దుటూరుకు ప్రత్యేక స్థానం
- మైసూరు తరువాత ప్రొద్దుటూరులోనే ఘనంగా దసరా వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి.. వరాల తల్లిగా భాసిల్లుతోంది. జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలకు వేళయింది.

దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడంలో రెండవ మైసూరుగా ప్రొద్దుటూరు పట్టణం పేరు గాంచింది. ఇక్కడ జరిగే దేవీశరన్నవ రాత్రి వేడుకలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన భక్తులు పట్టణానికి చేరుకుంటారు. పుత్తడిపురంగా పేరొందిన ప్రొద్దుటూరు అంటే గుర్తుకు వచ్చేది శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం. ఈ ఆలయంలో నిర్వహించే దసరా వేడుకలు ప్రఖ్యాతి గాంచాయి. గురువారం నుంచి 13వ తేదీ వరకు ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించనున్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని శ్రీవాసవీ మాత కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతోంది. అమ్మవారిశాలను 1890లో నిర్మించారు. ఎత్తయిన గాలి గోపురం కలిగి, చక్కని శిల్ప కళా నైపుణ్యంలో పట్టణానికి శోభ చేకూర్చే విధంగా ఆలయాన్ని నిర్మించారు. పట్టణంలో జరిగే దసరా ఉత్సవాలు దేశంలోనే ప్రఖ్యాతి గాంచాయి. 1895 నుంచి దసరా ఉత్సవాలను ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాల్లో విజయదశమినాడు నిర్వహించే శమీదర్శన గ్రామోత్సవం, అర్ధరాత్రి తొట్టి మెరవని అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



వజ్రపు చీర అలంకరణలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు (ఫైల్)

రోజూ ప్రత్యేక పూజలు

వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి రోజూ విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు వాసవీ నిత్యహోమాన్ని లోకకల్యాణార్థం పండితులు చేస్తుంటారు. అమ్మవారికి ఏ ఆలయంలోలేని విధంగా పుత్తడి ఆభరణాలు, వజ్రపు చీరె, కిరీటం, బంగారు చీరె, ముత్యాలచీరెలు ఉన్నాయి. విశేష పర్వదినాల్లో అమ్మవారిని వీటితో అలంకరిస్తారు. ప్రతి సోమవారం సాయంత్రం గజవాహన సేవ, మంగళవారం సాయంత్రం సువర్ణ రజిత అష్టదళ పాదపద్మసేవ, బుధవారం వెండి ఊయలసేవ, గురువారం స్వర్ణరథసేవ, శుక్రవారం పల్లకిసేవ, శనివారం వెండి సింహాసనసేవ, ఆదివారం ఉదయం 108 కలశాలతో గో క్షీరంతో అభిషేకం, సాయంత్రం స్వర్ణరథసేవ నిర్వహిస్తారు.

ఆలయానికి ఘన చరిత్ర

ప్రొద్దుటూరు అమ్మవారిశాలకు ఘన చరిత్ర ఉంది. 1895 నుండి నిర్మాణ ఖర్చులతో కూడిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని ఎందరో మహానుభావులు, జాతీయ, రాష్ట్ర రాజకీయ నాయకులు, పదవిలో ఉన్నవారు దర్శించుకున్నారు. 1929లో జాతిపిత మహాత్మ గాంధీ ఆలయాన్ని సందర్శించారు. కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి, జయేంద్ర సరస్వతిలు ఆలయంలో 40 రోజుల పాటు బస చేసి యజ్ఞయాగాదులు నిర్వహించారు. అమ్మవారి శాల గర్భగుడికి వెండి తొడుగులను అమర్చారు. ఆలయంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వర దేవి జన్మ వృత్తాంతం తెలిపే చిత్రపటాలు దర్శనమిస్తాయి.



విద్యుత్ దీపకాంతులతో వెలుగొందుతున్న ప్రొద్దుటూరులోని అమ్మవారిశాల (ఫైల్)

రోజూ విశేషంగా అలంకారాలు

దసరా ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి 13 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవిని ప్రతి రోజూ ఒక్కో రూపంలో అలంకరిస్తారు.

- 3న సాయంత్రం రాజరాజేశ్వరి దేవి, 4న భవాని దేవి, 5న శారదాదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న సాయంత్రం శ్రీదేవి వనవిహారిణి, రాత్రి బిల్వ వృక్ష వాసిని పార్వతీదేవి, 8న గజలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న మహిషాసుర మర్దినీ దేవి, 11న గాయత్రీదేవి, 12న విజయలక్ష్మీదేవి అలంకారం శమీదర్శన మహోత్సవం, అర్ధరాత్రి తొట్టి మెరవణి, 13న వాసవీ కన్యకాపరమేశ్వరిదేవిగా భక్తులకు దర్శన మివ్వనున్నారు.

అట్టహాసంగా అమ్మవారిశాలలో 134వ దసరా ఉత్సవాలు

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో 134వ దసరా ఉత్సవాలను ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్ రావు తెలిపారు. ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం దసరా ప్రారంభ వేడుకలు అత్యంత వైభవంగా చేస్తామన్నారు. ప్రతి రోజూ వైభవోపేతంగా ప్రత్యేక కార్యక్రమాలతో ఉత్సవాలు సాగుతాయన్నారు. 12న విజయ దశమి సందర్భంగా శమీదర్శనం, తొట్టి మెరవణిలో కేరళ సింగారిమేళం, శక్తి వేషాలు, డూప్స్, హర్యాణా వారి భంభం భోలే వేషధారణలు అలరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, శంకర్, పోలేపల్లి రాజబాబు, ఓబులేసు, వెంకటేశ్వర్లు, రవీంద్ర, సుబ్బారావు, సాయికుమార్, బాలరాజు, పిచ్చయ్య, నవీన్‌కుమార్, జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్, కెవీ.చలపతి తదితరులు పాల్గొన్నారు.



దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న బుశెట్టి రామ్మోహన్ తదితరులు

దసరా స్పెషల్

- పండుగ సందర్భంగా ఆర్టీసీ విశేష ఏర్పాట్లు
- ఈనెల 4 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక బస్సులు
- ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు స్వస్థలాలకు వచ్చేందుకు చర్యలు
- కడప జోన్ పరిధిలోని ఎనిమిది జిల్లాల నుంచి ప్రత్యేక సర్వీసులు
- పండుగకు వచ్చేందుకు 790 సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: తెలుగువారు అత్యంత వైభవంగా పది రోజులపాటు నిర్వహించుకునే దసరా పండుగ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు విశేష ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు చెందిన అనేక మంది ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులు చేసుకుంటూ సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అలాంటి వారిలో అధికశాతం మంది పెద్ద పండుగగా పేర్కొనే దసరా సందర్భంగా తమతమ స్వస్థలాలకు రావడం, కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రజల అవసరాల మేరకు ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడుపుతూ ప్రజల అవసరాలు తీరుస్తూనే మరోవైపు సంస్థ ఆదాయానికి తమవంతుగా కృషి చేస్తున్నారు.



ఆర్టీసీ బస్టాండులోని ప్లాట్‌ఫారాల వద్ద బస్సులు

దసరా సందర్భంగా కార్యచరణ ప్రణాళిక

కడప జోన్‌లోని ఎనిమిది జిల్లాల నుంచి దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులను అధికారులు నడిపేలా కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రీ దసరా, పోస్ట్ దసరా పేరుతో అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

- కడప జోన్ పరిధిలోని 8 డిపోల నుంచి ప్రీ దసరా సందర్భంగా హైదరాబాదుకు 285 బస్సులు, బెంగుళూరు 224, విజయవాడ 76, చెన్నై 40 బస్సులతోపాటు ఇతర ప్రాంతాలకు 133 సర్వీసులు నడుపుతున్నారు.
- జోన్ పరిధిలోని అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల డిపోల నుంచి అక్టోబరు 4న 43, 5న 44, 8న 89, 9న 120, 10న 192, 11న 302 బస్సులు కలిపి మొత్తం 790 బస్సులు నడుపుతున్నారు. అలాగే పండుగ ముగిసిన తర్వాత ఆయా డిపోల నుంచి విజయవాడకు 73, హైదరాబాదుకు 251, బెంగుళూరు 253, చెన్నై 23తోపాటు ఇతర ప్రాంతాలకు 32 సర్వీసులకు కలిపి మొత్తం 632 బస్సులను నడిపేలా చర్యలు చేపట్టారు.

సాధారణ చార్జీలతో ప్రత్యేక సర్వీసులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు కాక ముందు వరకు ఏపీఎస్ ఆర్టీసీ పండుగలు, ఇతర ప్రత్యేక సర్వీసుల్లో ప్రయాణించేవారికి అధిక ఛార్జీలు వసూలు చేసేవారు. కాగా ప్రైవేటు ట్రావెల్స్‌లో పరిస్థితులను బట్టి రెండింతలు, ఇంకా ఎక్కువ మొత్తంలో వసూలు చేసి నిలువుదోపిడీ చేసేవారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజల ఇబ్బందులు గుర్తిస్తూ సాధారణ ఛార్జీలతోనే స్పెషల్ సర్వీసుల్లో ప్రయాణించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణీకులకు ఎంతో ఉపశమనంగా ఉండేది. నాడు వైఎస్ జగన్ ప్రారంభించిన ఈ విధానాన్ని ఆర్టీసీ అధికారులు నేటికీ అమలు చేస్తున్నారు.

ప్రజలు స్పెషల్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి



దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణీకుల సౌకర్యార్థం విశేష ఏర్పాట్లు చేశాము. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాము. సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరుతున్నాం. – పాలిమేర గోపాల్‌రెడ్డి, రీజినల్ మేనేజర్, ఏపీఎస్ ఆర్టీసీ, కడప

వేగం తెచ్చిన ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న సిమెంట్ లారీ
- తప్పిన ఘోర ప్రమాదం
- ముగ్గురి పరిస్థితి విషమం
- మెరుగైన వైద్యం కోసం ఆరుగురిని రెఫర్ చేసిన వైద్యులు

మదనపల్లె/కురబలకోట: అతి వేగమే ప్రమాదానికి కారణమైంది. అంతేగాకుండా అనర్థానికి దారి తీసింది. ఖాళీ కంటైనర్ వేగంగా వచ్చి ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ రామక్రిష్ణ, కండక్టర్ సురేష్‌తో పాటు 32 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండగా, ఆరుగురిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యులు ఇతర ప్రాంతాలకు రెఫర్ చేశారు. మరో పది నిమిషాల్లో మదనపల్లె పట్టణానికి గమ్యస్థానం చేరుకుంటామని ఆత్రుతగా ఉన్న ప్రయాణికులకు ఊహించని ప్రమాదం క్షతగాత్రులను చేసింది. ఈ విషాద సంఘటన కురబలకోట మండలం సర్కారుతోపు మలుపు వద్ద హైవేపై మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది.

వివరాలు... మంగళవారం మధ్యాహ్నం మదనపల్లె రెండో డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గాలివీడు నుంచి గుర్రంకొండ మీదుగా మదనపల్లెకు వస్తుండగా, సర్కారు తోపు వద్ద కడప వైపు వెళ్తున్న ఖాళీ కంటైనర్ వేగంగా వచ్చి డివైడర్‌ను దాటి ఆర్టీసీ బస్సు ముందు భాగంలో ఢీకొంది. దీంతో ఆర్టీసీ బస్సు వెనక్కు వెళ్లడంతో బస్సు వెనక ద్విచక్ర వాహనంలో ఉన్న మదనపల్లె మండలం, సీటీఎం పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటసుబ్బయ్య(50) తీవ్రంగా గాయపడ్డాడు.ఆ వెనకే ఉన్న టాటా ఏస్ వాహనం దెబ్బతింది. బస్సులో దాదాపు 50 మంది ప్రయాణికులు ఉండగా 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద పెద్ద సంఖ్యలో చేరుకున్న బాధితుల బంధువులు ఆస్పత్రి లోపలికి వెళ్లేందుకు వారు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఆస్పత్రి అత్యవసర విభాగం సిబ్బంది, వైద్యులు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజు, ఆర్ఎంఓ ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించారు. తీవ్రంగా గాయపడిన వారిలో మదనపల్లె ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎం రామకృష్ణ (55), కండక్టర్ ఏబీ సురేష్ (49), ద్విచక్ర వాహన చోదకుడు వెంకటసుబ్బయ్య(50) ఉన్నారు. వీరితోపాటు గుర్రంకొండ మండలం నడిమి కండ్రిక గ్రామానికి చెందిన పి గిరిబాబు (45), మదనపల్లె బాలాజీ నగర్‌కు చెందిన సురేష్ కుమార్ (53), పెద్దమండెం మండలం సిద్ధవరం కు చెందిన పద్మజ (27),లను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కాగా గాయపడిన వారిలో మదనపల్లె , నీరుగట్టువారిపల్లెకు చెందిన సునంద(36), కదిరి మండలం రెక్కమానుకు చెందిన పార్వతమ్మ (65) కాళ్లు విరిగాయి. అనూష (18), స్పందన (16) సింగారెడ్డి(21) నందిని (17) విజయలక్ష్మి(17) విజయ్ కుమార్ రెడ్డి (18) స్వాతి (16) మనోజ్ (20) నరసింహులు (58) రమాదేవి (54) వెంకటస్వామి (50) శ్రీరాములు రెడ్డి (64) వెంకటరమణ (60) షాహినా (44) ముబారక్ బాషా (63) జరీనా (60) రెడ్డి ప్రసాద్ (35) రెడ్డి శేఖర్ (38) ఖాదరవలీ (06) లక్ష్మమ్మ (64) గాయపడ్డారు. మరికొందరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ సలీమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కంటైనర్

క్షతగాత్రులను పరామర్శించిన సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, డీఎస్పీ కొండయ్య నాయుడు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య చికిత్స అవసరమైన వారికి దగ్గరుండి అంబులెన్సులో ఇతర ప్రాంతాలకు తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజును ఆదేశించారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేయాలని అధికారులకు సూచించారు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామకృష్ణ



కండక్టర్ ఏబీ సురేష్



ద్విచక్ర వాహన చోదకుడు వెంకటసుబ్బయ్య



పద్మజ



పార్వతమ్మ

ఏపీ టెట్ పరీక్షకు ఏర్పాట్లు సిద్ధం

- నాలుగు కేంద్రాలు.. రెండు విడతలుగా పరీక్ష.. 11770 మంది అభ్యర్థులు
- అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) – 2024కు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబరు 3 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే టెట్ పరీక్షకు 11770 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కేంద్రాలలో సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని డీఈఓ సూచించారు. పరీక్షను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాల, భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాల, మదనపల్లిలోని మదనపల్లి ఇంజినీరింగ్ కళాశాల, విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు 9440988528, 9030504233, 8074084138 నంబర్లకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

- రాయచోటి భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో 2617 మంది అభ్యర్థులు, సాయి ఇంజినీరింగ్ కళాశాలలో 2000 మంది. మదనపల్లి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి అండ్ సైన్స్ కళాశాలలో 855 మంది, విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో 6298 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

క్లుప్తంగా

సౌమ్యనాథుడి హుండీ ఆదాయం లెక్కింపు

నందలూరు : జిల్లాలో సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ అధ్యక్షతన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు సమర్పించిన ఒక నెలకు సంబంధించి కానులను లెక్కించగా రూ. 1,73,175లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ నగదును ఆలయానికి సంబంధించిన బ్యాంకు ఖాతాలలో జమ చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంబేపల్లె : మండల పరిధిలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గానిపల్లె శ్రీనివాసులు (51) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని దేవపట్ల సమీపంలో ఉన్న వైఎస్ఆర్‌కాలనీ చెందిన శ్రీనివాసులు తన వాహనంలో సొంత పనుల నిమిత్తం దేవపట్లకు వెళుతుండగా రాయచోటి వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండా మార్గం మధ్యలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అండర్-17 బాలుర, బాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

రాయచోటి (జగదాంబసెంటర్) : మండలంలోని అంబేద్కర్ గురుకులపాఠశాలలో ఉమ్మడి కడప జిల్లా అండర్-17 బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక జరిగినట్లు కడప జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ అరుణకుమారి, అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వసంత తెలిపారు. అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వరప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని, ఎంపికలకు విచ్చేసిన విద్యార్థులకు సూచించారు. ఎంపికల్లో ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని పది నియోజకవర్గాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బి.కొత్తకోట : కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బి.కొత్తకోట మండలంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు...మండలంలోని గట్టుగ్రామం ఎల్లమ్మగారిపల్లెకు చెందిన వై.రామిరెడ్డి(65) ఇతను 25 ఏళ్లగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినప్పటికి కడుపునొప్పి తగ్గలేదు .దీంతో గత నెల 26వతేదీన కడుపునొప్పి భరించలేక ఇంట్లోలో ఉన్న పురుగు మందు తాగాడు. తరువాత బాధతో ఏడుస్తుండగా భార్య లక్ష్మమ్మ గమనించేలోగా వాంతులు చేసుకుండటంతో వైద్యం కోసం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సలహా మేరకు తిరుపతి రూయాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఓటర్ల సవరణ త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: ఓటర్ల సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ విజయవాడలోని తన కార్యాలయం నుంచి ఓటర్ల సవరణ ప్రక్రియ-2025, ప్రతి ఇంటికి వెళ్లి చేసే సర్వే ప్రక్రియ, పోలింగ్ కేంద్రాలలో మార్పులు, చేర్పులు, స్విప్ కార్యక్రమాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాల్గొన్నారు. జిల్లాలో ఇంటింటికి వెళ్లి చేసే సర్వే ప్రక్రియ 99.59 శాతం పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారమ్‌లు తదితర పనులను వెంటనే పూర్తి చేయాలని ఎన్నికల విభాగం సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శన్ రాజేంద్రన్, డీఆర్‌ఓ సత్యనారాయణరావు, ఎలక్షన్ సెల్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

సూపరింటెండెంట్ నరసింహ కుమార్, ఎలక్షన్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నూతన మద్యం పాలసీ అమలు

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లాలో నూతన మద్యం పాలసీ అమలవుతుందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం నూతన మద్యం విధానంపై కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్టోబర్ 9వ తేది సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 111 షాపులకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అలాగే జనాభా ప్రాతిపదికన లైసెన్స్ రుసుం నిర్ణయిస్తామన్నారు. ఈ నూతన విధానంలో ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక దరఖాస్తుకు రూ.2లక్షలు చెల్లించాలని చెప్పారు. లైసెన్స్ రుసుం వెనక్కు ఇవ్వరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శన్ రాజేంద్ర, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

జిల్లాకు స్వచ్ఛతాహీ సేవ ఉత్తమ అవార్డు

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఉత్తమ పనితీరుతో మంచి కార్యక్రమాలు నిర్వహించినందుకు స్వచ్ఛతాహీ సేవా-2024 గ్రామీణ విభాగంలో సాఫాయి మిత్ర సురక్ష కాంపొనెంట్ అన్నమయ్య జిల్లాకు ఉత్తమ అవార్డు అందిందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ఈ అవార్డును అన్నమయ్య జిల్లా తరపున జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మీ అక్టోబర్ 2వ తేదీన మచిలీపట్నంలో జరగబోయే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకుంటారన్నారు.

విధి చిన్నచూపు..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- ఏడాది క్రితమే తల్లి కూడా మరణించింది
- అనాథలుగా మారిన కుమారులు

తంబళ్లపల్లె : ఏడాది క్రితం తల్లి మృతి చెందింది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి రోడ్డు ప్రమాద రూపంలో తీసుకెళ్లావా దేవుడా.. మాపై ఎందుకు ఇంత పగ అంటూ విగత జీవిగా మారిన తండ్రి మృతదేహం వద్ద ఆ బాలుడు రోదన పలువురి మనస్సులను కలిచివేసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గంగిరెడ్డిపల్లెకు చెందిన మధుకర్‌నాయుడు (44) గోపిదిన్నె పోస్టాఫీసులో పోస్టుమాన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబ పోషణ సాగించేవాడు. మంగళవారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. పరసతోపు గ్రామ సచివాలయం వద్ద ములకలచెరువు రోడ్డులో వస్తున్న బోరు లారీ ద్విచక్రవాహన్నాన్ని ఢీ కొనడంతో అక్కడికక్కడే మధుకర్‌నాయుడు మృతి చెందాడు. మృతుని భార్య పద్మప్రియ పోస్టుమాన్‌గా పని చేస్తూ ఏడాది క్రితం మృతి చెందింది. పెద్దకుమారుడు జస్వంత్ నాయుడు మదనపల్లెలో పదో తరగతి చదువుతున్నాడు. రెండవ కుమారుడు సందీప్‌నాయుడు తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సంఘటన జరిగిన సమయానికి మోడల్ స్కూల్ వదిలిపెట్టడంతో చిన్నకుమారుడు సంఘటనా స్థలానికి చేరుకుని విగతజీవిగా పడి ఉన్న తండ్రి మృతదేహం వద్ద బోరున విలపించాడు. హెడ్‌కానిస్టేబుల్ శంకర్, గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని శమృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన మధుకర్‌నాయుడు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

– ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

మదనపల్లె : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని, మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు తాలూకా సీఐ కే.కళావెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నె క్రాస్‌లో నివాసం ఉన్న రామిరెడ్డి కుమారుడు జి.సంతోష్‌రెడ్డి ఇంజినీరింగ్(సీఎస్ఈ) పూర్తిచేసి నిరుద్యోగిగా ఉన్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడి ద్వారా పీలేరు ప్రాంతానికి చెందిన హర్షరెడ్డి పరిచయమయ్యాడు. క్యూస్‌వింగ్ టుగెదర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆగస్టు 28, సెప్టెంబర్ 25న రెండు విడతలుగా సంతోష్‌రెడ్డి నుంచి రూ.2.30 లక్షల నగదును హర్షరెడ్డి స్నేహితుడైన సద్దాం హుస్సేన్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించాడు. అనంతరం సంతోష్‌రెడ్డిని బెంగళూరుకు తీసుకెళ్లి కంపెనీ చూపించి ఒక ఉద్యోగిని పరిచయం చేయించాడు. అక్కడ నుంచి మదనపల్లెకు వచ్చి అపాయింట్‌మెంట్ లెటర్ పంపుతామని చెప్పాడు. అనంతరం ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్ సంతోష్‌రెడ్డికి పంపాడు. ఆ లెటర్‌తో ఉద్యోగం రాకపోవడంతో, తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాల్సిందిగా హర్షరెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. అయినా నగదు చెల్లించకుండా, వేధిస్తుండటంతో బాధితుడు సంతోష్ రెడ్డి మంగళవారం తాలూకా పోలీసులకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేశాడు.

ఆటోను ఢీకొన్న బస్సు

– ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయం సమీపంలో మంగళవారం ఆటోను బస్సు ఢీకొంది. ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నుంచి తిరుపతికి వెళుతున్న ఏపీఎస్ ఆర్టీసీ నాన్‌స్టాప్ ఎలక్ట్రికల్ బస్సు రాజంపేట నుంచి కడప ఇందిరా నగర్‌కు వెళుతున్న ఆటోను కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్దకు రాగానే ఢీకొంది. ప్రమాదంలో పెనగలూరు మండలానికి చెందిన ఆటో డ్రైవర్ రామచంద్రయ్య, ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధురాలు నరసమ్మ గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని గాయపడిన ఇద్దరిని వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల,బాలికల జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-17 బాల, బాలికల హాకీ జట్టును మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన బాల, బాలికలను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. త్వరలో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజ, క్రీడాభారతి కార్యదర్శి నరేష్ బాబు, పీడీలు రెడ్డి శ్రీనివాస్, పాండ్యన్, పార్థసారధి, శ్రీనివాసులు, జలజ, నాగరాజ, అరుణ, ప్రసన్న, భార్గవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి తీవ్ర గాయాలు

వీరబల్లి : రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి వరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఈమె పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వెళ్లి తమ విధులు ముగించుకొని ఇంటికి ద్విచక్ర వాహనంలో వెళ్లే సమయంలో అదుపు తప్పి కిందపడింది.

ఇసుక టిప్పర్ సీజ్

రామసముద్రం : పుంగనూరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. అనుమతి లేకుండా పుంగనూరు చదళ్ల ఇసుక రీచ్ నుంచి మంగళవారం టిప్పర్‌లో రామసముద్రం వైపు నుంచి ఇసుక చెంబకూరుకు వెళుతుండగా, సమాచారం మేరకు టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

గాలివీడు : విధులకు డుమ్మాకొట్టిన ఉపాధ్యాయుడు బి.వెంకటేశ్వర్లుపై డీఈఓకు ఫిర్యాదు చేసినట్లు ఎంఈఓ పిల్లి నాగరాజు తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలం అరవీడు గ్రామం గాండ్లపల్లి ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న బి.వెంకటేశ్వర్లు తరచూ పాఠశాలకు గైర్హాజరు అవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారన్నారు. ఈసంఘటనపై స్పందించిన ఎంఈఓ తన సిబ్బందితో కలసి పాఠశాలను సందర్శించి, విచారించగా ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తేల్చారు. ఏడాది క్రితం తూముకుంట నుంచి బదిలీపై గాండ్లపల్లెకు వచ్చిన సదరు ఉపాధ్యాయుడు వీలున్నప్పుడు పాఠశాలకు రావడం ఓ గంట కాలక్షేపం చేసి పాఠశాలకు తాళాలు వేసుకుని వెళ్లిపోవడం పరిపాటిగా మారిపోయిందన్నారు. ప్రశ్నించిన తల్లిదండ్రులను, విద్యార్థులను దుర్భాషలాడేవాడని స్థానికులు ఎంఈఓ దృష్టికి తీసుకువచ్చారు. జరిగిన వాస్తవాలను నివేదిక రూపంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపినట్లు ఎంఈఓ తెలిపారు.



పాఠశాలకు వేసిన తాళాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

సీజ్ చేసిన ఇసుకను దోచుకెళ్లిన టీడీపీ వర్గీయులు

అడ్డుకోబోయిన వైఎస్సార్ సీపీ శ్రేణులపై మరణాయుధాలతో దాడికి యత్నం

ములకలచెరువు : అధికారులు సీజ్ చేసిన ఇసుకను టీడీపీ వర్గీయులు దోచెకెళ్లారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి పనుల కోసం అధికారికంగా ఇసుకను తరలించి నిల్వచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుట్రలు పన్ని నిల్వచేసిన ఇసుకను సీజ్ చేయించార్చు, సందిట్లో సడే మియా అంటూ కూటమి నాయకులు దౌర్జన్యంగా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. సోమవారం సాయంత్రం ఇలాంటి సంఘటన చోటుకుంది. మండలంలోని సోంపల్లె పంచాయతీ జవకలకోట వద్ద గండికోట జలాశయం నుంచి హంద్రీ నివా కాలువకు అనుసంధానం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పైపులైన్ పనుల కోసం సుమారుగా రూ.5 వేల కోట్ల నిధులు వెచ్చించి పనులు చేపట్టారు. ఈ పనుల కోసం అధికారికంగా ఇసుకను నిల్వ చేశారు. ప్రభుత్వం మారడంతో కూటమి నాయకులు అనధికారికంగా సీజ్ చేసిన ఇసుకను తరలించి జేబులు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారు. గమనించిన స్థానిక సర్పంచ్ మంజులా, నాయకులు రామనాథం, శ్రీనివాసులు తదితరులు సోమవారం సాయంత్రం ఇసుక తరలింపును అడ్డుకున్నారు. దీనితో ఆగ్రహానికి లోనైన పలువురు కూటమి నాయకులు వారిపై దాడికి ప్రయతించారు. అనంతరం పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపివేశారు. ఈ ఘటనపై తహసీల్దార్ ప్రదీప్‌ను వివరణ కోరగా సీజ్ చేసిన ఇసుకను తరలించడం నేరమన్నారు. రిపోర్టు సిద్ధం చేసి సంబంధితులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.



సీజ్ చేసిన ఇసుకను అక్రమంగా తరలించిన కూటమి నాయకులు

విశాఖస్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

రిలేదీక్షలలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : విశాఖ ఉక్కు ప్యాక్టరీని సెయిల్‌లో విలీనం చేయాలని అఖిలపక్ష విద్యార్థి సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను వెంటనే మానుకోవాలన్న డిమాండ్‌తో అఖిలపక్ష విద్యార్థి సంఘాల నేతలు రిలే దీక్షలను చేపట్టారు. శిబిరాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు ప్రారం భించారు. ఈ సందర్భంగా విద్యార్థిసంఘాలు, సీపీఐ, సీపీఎం నేతలు నరసింహ, జక్కల వెంకటేష్, పియల్ నరసింహులు, అబ్బవరం రామాంజులు మాట్లాడుతూ విద్యార్థులు, రైతులు, వామపక్ష ఎమ్మెల్యేల త్యాగాలతో విశాఖ ఉక్కు కార్మాగారం ఏర్పాటు చేయబడిందన్నారు. ఇంతటి చరిత్రగల విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే పాలకుల ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖస్టీల్ ప్లాంటు నిర్వహణకు అవసరమైన స్టీల్‌గనులను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. దీక్షలు చేపట్టిన వారిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, మాధవ్, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, అశోక్, ఐసా జిల్లా కార్యదర్శి లవకుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.



రిలేదీక్షలు చేపట్టిన అఖిలపక్షల విద్యార్థి సంఘాల నేతలు

పోలీస్ స్టేషన్ ఎదుట వివాహిత ఆత్మహత్యాయత్నం

పీలేరు రూర్ : పీలేరు పోలీస్ స్టేషన్‌లో తమకు న్యాయం జరగలేదని మంగళవారం ఓ వివాహిత ఆత్మహత్యయత్నంకు పాల్పడింది. వివరాలిలావున్నాయి. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన బండి సుగుణమ్మ తన తమ్ముడు బి. సత్యనారాయణ ఇంటిలో రెండు నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించి ఇంటి చుట్టూ అక్షింతలు చల్లి వెళ్లారు. గమనించిన కుటుంబ సభ్యులు నెలరోజుల క్రితం ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 19న ఇందిరమ్మ కాలనీకి చెందిన తాటిపర్తి నాగరాజ క్షుద్రపూజలు నిర్వహించినట్లు సీసీ ఫుటేజీలో నమోదైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజ కుమార్తె అపరంజి తనపై అదే కాలనికి చెందిన బి. సత్యనారాయణ అత్యాచార యత్నం చేసినట్లు స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం స్పందన అర్జీని సీఐ యుగంధర్ పరిశీలించారు. ఈ సమయంలో సత్యనారాయణ అక్క సుగుణమ్మ (30) తమ పై కేసు నమోదు చేస్తే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన బంధులు ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదులపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఆత్మహత్య యత్నం చేసిన సుగుణమ్మ

ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి

దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్

రామాపురం : ఆలయాల జీర్ణోద్ధరణకు అన్ని విధాల కృషి చేస్తామని ఉమ్మడి జిల్లాల దేవదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని హసనాపురం గ్రామంలో వెలసిన పలు దేవాలయాలను ఆయన సందర్శించారు. దేవాలయాలపై పిచ్చిమొక్కలు మొలవడంపై ఆలయ కమిటీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హసనాపురం గ్రామంలోని ఎరుగులమ్మ దేవాలయం, కోదండరామస్వామి ఆలయం, మూలస్థానేశ్వర స్వామి ఆలయం, వెంకటేశ్వర స్వామి ఆలయం తదితర ఆలయాలను పరిశీలించారు. ఆలయాలు ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదని, దేవాలయాలకు కేటాయించిన భూములు అన్యాక్రాంతం కావడంతో పాటు ఆలయాలకు సంబంధించిన నిధులు పూర్తిగా నాయకులు తినేశారని, ఎరుగులమ్మ ఆలయానికి సంబంధించిన నిధులు గతంలో ఆలయ ధర్మకర్తగా ఆలయాన్ని పూర్తిగా కట్టించినట్లుగా బిల్లులు మార్చుకున్నారన్నారు. హసనాపురం కస్బాలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కట్టకుండా అసంపూర్తిగా నిలిపేశారని, దీంతో ఆలయంలో పిచ్చి మొక్కలు మొలిచాయి. పప్పిరెడ్డిగారిపల్లెలోని దేవాలయం పరిస్థితి అలాగే ఉందన్నారు. ఆలయాల జీర్ణోద్ధరణకు అన్ని విధాలు కృషి చేస్తామని, ధూప దీప నైవేద్యాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. హిందూ సనాతన ధర్మం ప్రకారం అన్ని ఆయాలలో జీర్ణోద్ధరణకు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఆలయాలకు సంబంధించిన భూములు ఎక్కడున్నా, ఎవ్వరి వద్ద ఉన్నను బయటికి తీస్తామని, ఆ భూముల్లో వచ్చే ఆదాయం ఆలయాలకు ఉపయోపడే విధంగా చర్యలు చేపడతామన్నారు. దేవుడికి వచ్చే డబ్బుల విషయంలో ఎవరు అవకతవకలకు పాల్పడవద్దని, ఆలయాల పేరుతో వచ్చే ప్రతి రూపాయి ఆలయాలకు ఖర్చు పెట్టాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి వీరభద్ర స్వామి దేవాలయం ఈఓ రమణారెడ్డి, సిబ్బంది, మండల పోలీసులు పాల్గొన్నారు.



హసనాపురంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్

దళితుల హక్కులకై పోరాడితే కేసులా?

- డీఎస్పీ కొండయ్యానాయుడుపై నేషనల్ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు, హైకోర్టులో పిల్.
- బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్

మదనపల్లె : దళితులపై వరుసగా జరుగుతున్న దాడులను నిరసిస్తూ, సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తే బహుజన్ సమాజ్ పార్టీ నాయకులపై కేసులు నమోదు చేస్తారా అని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ ప్రశ్నించారు. మంగళవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బందెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ... ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అంబేద్కర్ ఫ్లెక్సీని చించేసినందుకు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతంనానాజీ, దళిత డాక్టర్‌పై దాడిచేసినందుకు మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టామన్నారు. దీనిపై డీఎస్పీ కొండయ్యానాయుడు ఆదేశాలతో, పోలీసులు తనతోపాటుగా కొంతమంది బీఎస్పీ నాయకులపై కేసు నమోదు చేశారన్నారు. బీఎస్పీ కార్యక్రమానికి ముందు ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో 45 నిమిషాలకు పైగా లౌడ్ స్పీకర్లు పెట్టుకుని, రోడ్డుపై ధర్నా చేసినప్పటికీ వారిపై కేసులు నమోదు చేయకుండా, కేవలం తమపైనే పెట్టడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. బీఎస్పీ నాయకులపై కేసులను నిరసిస్తూ, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో బహుజనసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నామని తెలిపారు. డీఎస్పీ కొండయ్యానాయుడుపై నేషనల్ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదుచేశామని, అదేవిధంగా హైకోర్టులో పిల్ వేసి కచ్చితంగా న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమణ, బాలాజీ, గంగాధర్, దంపెట్లశివ, గూడుపల్లి శివ, ప్రశాంత్, ప్రసాద్, మహేష్, రెడ్డెప్ప, నరసింహులు, ప్రకాష్, హరి, అనూష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్

నూతన మద్యం పాలసీ సవరించాలని నిరసన

రాయచోటి అర్బన్ : అక్టోబరు నుంచి అమలులోకి రానున్న నూతన మద్యం పాలసీని సవరించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సరోజనమ్మ, సుమిత్రమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు గంగారాణిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన మద్యం పాలసీని నిరసిస్తూ వారు మంగళవారం మహిళలతో కలసి బస్టాండు మార్గంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. వారు మాట్లాడుతూ నూతన మద్యం పాలసీలో భాగంగా ఏర్పాటు చేయతలపెట్టిన షాపుల సంఖ్యను, వాటి నిర్వహణ సమయాన్ని కుదించాలని కోరారు. మద్యపానం వలన కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. అన్ని అనర్థాలకు కారణమవుతున్న మద్యాన్ని నిషేధించకపోగా మరింత ఎక్కువ ఆదాయం వచ్చేలా మద్యం దుకాణాలను పెంచడం, రూ.99 లకే క్వార్టర్ మద్యం అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. పాలకులు మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటుండడం సిగ్గుచేటన్నారు. నూతన మద్యం పాలసీని రద్దు చేసి ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉదయం 11నుండి రాత్రి 8గంటల వరకు మాత్రమే మద్యం షాపుల నిర్వహణకు అనుమతివ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకు రాళ్ళు సుభాషిణి, వనిత, క్రిష్ణవేణి, లక్ష్మిదేవి, శంకరమ్మ, కనకమ్మతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద మహిళల నిరసన

తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారాలి

ఆర్జేడీ రవి, ఆర్ఐపీ భానుమూర్తిరాజు

రాజంపేట టౌన్ : విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారాల్సిన అవసరం ఎంతైనావుందని ఆర్జేడీ రవి, రాష్ట్ర వ్యాయామ విద్య తనిఖీ అధికారి జి.భానుమూర్తిరాజు తెలిపారు. రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి కరాటే పోటీలను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ.రమణరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలన్న ఆలోచనా విధానంలోనే ఉంటారని, అలాగే ప్రతిభగల క్రీడాకారులుగా తయారయ్యేందుకు ప్రోత్సహించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు కూడా ఉంటుందని తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. అనేక మంది క్రీడాకారులు స్పోర్ట్స్ కోటా కింద ఉన్నత విద్య అభ్యసించారని, ఉద్యోగ అవకాశాలు కూడా పొంది ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకున్నట్లు గుర్తు చేశారు. రాజంపేటలో గతంలో పలుమార్లు వివిధ జాతీయ స్థాయి పోటీలను కూడా ఇక్కడి అధికారులు సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ప్రతి క్రీడాకారుడు అత్యుత్తమ ప్రతిభకనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు కృషి చేయాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి చెందిన వారు నిరుత్సాహ పడకుండా మళ్ళీ గెలుపొందేందుకు కఠోర సాధన చేయాలన్నారు. వ్యక్తిగత క్రీడాంశాల్లో న్యాయనిర్ణేతలు నిష్పక్షపాతంగా రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ.రమణరాజు, పోటీల పరిశీలకులు ఎస్.విజయప్రసాద్ రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరి సీ.శారద, కమిటీ మెంబర్‌లు అరుణకుమారి, ఏ.సుబ్బరాజు, పీ.మురళీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ రవి